క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మహబూబాబాద్: పేదలకు అండ సీఎం రిలీఫ్ ఫండ్ అని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం రూ.6,07,500 విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను 23 మంది లబ్ధిదారులకు, రెండు లక్షల ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్ , మార్నేని వెంకన్న, మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికురాలికి సన్మానం



కేసముద్రం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన యాకమ్మ అవార్డును ఇటీవల హైదరాబాద్‌లో అందుకుంది. ఈమేరకు బుధవారం ఇనుగుర్తి జీపీలో సర్పంచ్ దార్ల రామ్మూర్తి ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా ఇనుగుర్తి గ్రామం ఎన్నికైన సందర్భంగా, సర్పంచ్, కార్యదర్శి ఆలేటి శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పింగిలి రజిత, శ్రీనివాస్, ఉపసర్పంచ్ దేవేందర్, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రా పద్ధతిలో కేటాయింపు

మహబూబాబాద్: పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించిన 36వార్డుల లబ్ధిదారులకు ఇళ్ల నంబర్లు కేటాయించామని మున్సిపల్ కమిషనర్ టి.ప్రసన్నరాణి, తహసీల్దార్ ఇమ్మానియల్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేయడంతోపాటు ఇంటి నంబర్ల విషయంలోనూ డ్రా పద్ధతిలో కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, ఫ్లోర్ లీడర్లు అజయ్‌సారథిరెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

బాలల సమస్యలు పరిష్కరించాలి

మరిపెడ: బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గుగులోతు అరుణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం హాలులో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ, మానవ అక్రమ రవాణాపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎస్సై ఝాన్సీ, ఎఫ్ఎంఎం ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీకాంత్, అరుణ, చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

వసతి గృహాల ప్రారంభమెప్పుడో?

● జిల్లాలో 8 మోడల్ స్కూల్ వసతి గృహాలు

మహబూబాబాద్ అర్బన్: నిరుపేద విద్యార్థులకు ఉత్తమ విద్యతోపాటు వసతి గృహంలో సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మోడల్ స్కూల్, కళాశాలలో వసతి గృహాలను ప్రవేశపెట్టింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మానుకోట జిల్లాలో మోడల్‌స్కూల్, కళాశాలలకు సంబంధించిన వసతి గృహాలు మారాయి. జూన్ 12న పాఠశాలలు, కళాశాలు ప్రారంభం అయ్యాయి. ఇప్పటి వరకు వసతి గృహాలను ప్రారంభించలేదు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు వసతి గృహంలో సరైన వసతులు లేక వెనుదిరిగిపోతున్నారు. జిల్లా కేంద్రంలోని ఉన్న మోడల్ వసతి గృహంలో సమస్యలు తిష్ట



మానుకోట జిల్లా కేంద్రంలో ప్రారంభం కాని మోడల్ వసతి గృహం

వేశాయి. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, గదులకు తలుపులు, కిటికీలకు సరైన రేక్కలు లేవు. అనేక సమస్యలతో అధ్వానంగా ఉంది. అదేవిధంగా మరుగుదొడ్ల సంబంధించిన మురుగునీరు అంతా హాస్టల్ ఆవరణంలోకి రావడంతో దుర్వాసన వెదజల్లుతోంది. జిల్లాలో మొత్తం 8 మోడల్ స్కూల్ వసతి గృహాలు ఉన్నాయి. ఒక్కొక్క వసతి గృహంలో 100మంది బాలికలకు అవకాశం కల్పిస్తారు, ఇలా జిల్లా 8 వసతి గృహాలకు 800మంది బాలికలకు అవకాశం లేక చాలా మంది విద్యార్థులు వసతి గృహంలో అడ్మిషన్ పొంది ఇంటి దగ్గర నుంచి కళాశాలకు వస్తు వెళ్తున్నారని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. జిల్లాలో కలెక్టర్, విద్యాశాఖ అధికారులు నిత్యం అందుబాటులో ఉంటారు. పాఠశాలలు, కళాశాలలు పున:ప్రారంభం అయి నేటికి 16 రోజులు గడిచిన ప్రారంభానికి నోచుకోపోవడం అధికారులు నిర్లక్ష్యంగా స్పష్టంగా కనిపిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఆట స్థలం కోసం విద్యార్థుల ఆందోళన

గూడూరు: ఆట స్థలం కోసం విద్యార్థులు ఆందోళన చేసిన సంఘటన మండలంలోని సీతానగరం గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం జరిగింది. వివరాల ప్రకారం పాఠశాల పక్కనే గల 15 గుంటల ఖాళీ స్థలాన్ని గత 5సంవత్సరాల క్రితం సీతానగరం సర్పంచ్‌గా ఎన్నికైన జాటోతు మాలీ హంజానాయక్ కొనుగోలు చేశాడు. అప్పుడే పాఠశాల హెచ్ఎం గాంగూనాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాలకు ఆట స్థలం కావాలని వారిని కోరారు. దీంతో వారు తమ కొడుకు 10 వ తరగతి చదివి వ్యవసాయం చేసుకుంటున్నాడు. అతనికి ఈ పాఠశాలలో ఏదైనా ఉద్యోగం ఐటీడీఏ నుంచి ఇప్పిస్తే, తాను ఖరీదు చేసిన స్థలాన్ని ఇస్తానని చెప్పాడు. ఈ విషయమై ఉపాధ్యాయ బృందం ఐటీడీఏ పీఓ, కలెక్టర్‌కు విన్నవించారు. వారు కూడా స్పందించి ఏదైన ఉద్యోగం కల్పిద్దాం, ఆ స్థలాన్ని ఆట స్థలం కోసం తీసుకోమన్నారు. కానీ 5 సంవత్సరాలుగా అధికారులు తన కొడుకుకు ఎలాంటి ఉద్యోగం ఇవ్వకపోగా, ఎలాంటి స్పందన లేదు. ఆట స్థలం విషయమై మాజీ సర్పంచ్ దంపతులు పాఠశాల ప్రిన్సిపాల్‌ను అడగ్గా స్పందించలేదు. దీంతో వారు ఓ ట్రాక్టర్ పెట్టి ఆట స్థలాన్ని దుక్కి చేసి పంట సాగు చేసుకొనే ప్రయత్నం చేస్తుండగా, విద్యార్థులు వారి పనికి అడ్డు తగిలి ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెల్సుకున్న ప్రిన్సిపాల్ గాంగూనాయక్, ఉపాధ్యాయులు అక్కడికి చేరుకొని సమస్యను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో పనిని నిలిపివేశాడు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పట్టాలు ఇవ్వడంలో విఫలం

నెల్లికుదురు: మా తాత ముత్తాల కాలం నాటి నుంచి సాగు చేసుకుని జీవిస్తున్న భూములకు ఇప్పటి వరకు పట్టాలు ఇవ్వడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని బాధిత రైతులు తోట రవీందర్, కోటగిరి సోమయ్య అన్నారు. ఈమేరకు మండలంలోని మేచరాజుపల్లి గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 117లో ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న నిరుపేద రైతులకు పట్టాలు అందించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాధితులు నక్క యాకయ్య, శ్రీనివాస్, కోటగిరి ప్రవీన్, కార్తీక్, ఉదయశ్రీ పాల్గొన్నారు.

వెంటనే రుణమాఫీ చేయాలి

గార్ల: రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ తాము తిరిగి అధికారంలోకి రాగానే రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని, అధికారం చేపట్టి 5 ఏళ్ల దగ్గర పడుతున్నా నేటికీ రైతులకు రుణమాఫీ చేయక పోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వెంకన్న, రైతులు రమేష్, రమేష్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన జల్లె సంతోష ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర విభాగానికి గాను డాక్టరేట్‌ను అందుకున్నాడు. భారతదేశంలో మార్పిడి రేటు, ఆర్థిక అభివృద్ధి అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని ఆమె సమర్పించింది. ఈమేరకు సంతోషకు హైదరాబాద్‌లో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

పీవీ నరసింహారావుకు ఘన నివాళి

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ దార్ల రామ్మూర్తి పీవీ నర్సింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పింగిలి రజిత, శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పీవీ నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కురవి: నివాళులర్పిస్తున్న నాయకులు

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్, నాయులు కత్తి వెంకన్న, లచ్చయ్య, ఆనందం పాల్గొన్నారు.

కాల్వలు ధ్వంసం చేస్తే చర్యలు తప్పవు



కాల్వను పరిశీలిస్తున్న డీఈ, ఎస్సై

దంతాలపల్లి: ప్రజలకు సాగునీరు అందివ్వాలని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల వద్ద భూమి తీసుకొని వారికి డబ్బులు చెలించి తీసిన కాల్వలను ఎవరైనా ధ్వంసం చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎస్సారెస్పీ డీఈ వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రేపోని గ్రామంలో కాల్వ గట్లు ధ్వంసం చేసి సాగు చేస్తున్నారని, వెళ్లడానికి దారి లేకుండా చేశారని రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలోగల ఎస్సారెస్పీ 60 డీబీఎం,13 ఆర్3ఆర్ కాల్వలను బుధవారం ఎస్సై కూచిపూడి జగదీష్ తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ మౌనిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

కురవి: సీరోలు మండలం చింతపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఇస్లావత్ లచ్చిరాంనాయక్ తెలిపారు. బుధవారం పాఠశాలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలికలను అభినందించారు. జిల్లా కేంద్రంలో జరిగిన అండర్–18 బాస్కెట్ బాల్ క్రీడలో చింతపల్లి హైస్కూల్‌కు చెందిన వాంకుడోత్ మహేశ్వరీ, నెర్సు యశ్విని, తేజావత్ దీపిక, గడ్డం పూజ, ధీరావత్ శ్వేతలు అత్యంత ప్రతిభకనబరిచారు. ఈనెల 30వ తేది నుంచి జూలై 2వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగబోయే పోటీలో పాల్గొంటారని ఆయన వివరించారు. కార్యక్రమంలో పీఈటీ పిల్లి కమల్‌కిషోర్, ఉపాధ్యాయులు షేక్ సలీం, అన్నెపురం రాధిక, గుమ్మడి లలిత, సోమనాథ రాజు, అనిత, లావణ్యకుమారి పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన బాలికలతో హెచ్ఎం, పీఈటీ

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

దంతాలపల్లి: గెలుపు గుర్రాలకే సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ టికెట్లు ఇస్తారని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌లో ఓటమి పాలయ్యే వ్యక్తులకు టికెట్లు ఇవ్వకపోవడంతో పార్టీని విడిచి వేరే వెళ్తున్నారన్నారు. పొంగిలేటి శ్రీనువాస్‌రెడ్డి ప్రభావం యోజకవర్గంలో ఏమి పనిచేయదన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పల కాపాడుకుంటానని, బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం సైనికుల పనిచేయాలన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇండియన్ పెట్రోల్ బంక్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నెహ్రూ నాయక్, ఎంపీటీసీ రమణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్యానాయక్

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



మహబూబాబాద్ రూరల్‌లో..



కేసముద్రం: నోట్‌బుక్స్ అందజేస్తున్న వ్యాపారులు

కేసముద్రం: మండలంలోని రంగాపురం గ్రామంలో గల యూపీఎస్‌లో బుధవారం ప్రముఖ వ్యాపారి వోలం కృష్ణమూర్తి ఐదు డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. అదేవిధంగా ప్రముఖ వ్యాపారి కొల్లూరి రమేష్ విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులను, వ్యాపారి శ్రీరాంచంద్రన్‌కుమార్ ఏడాదికి సరిపడా నోట్‌బుక్స్‌లను, పెన్సిల్స్, పెన్నులు, పలకలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం కాలేరు యాదగిరి, సర్పంచ్ భుక్యా రాములు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బీరం జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాయులు సంతోష్, సరిత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్యాగులు, నోటు బుక్కుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: వరంగల్ శ్రీషిర్డీ సాయి సేవా ట్రస్ట్ బాధ్యులు మండలంలోని ఉత్తరతండా మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు లలిత, అనిత, మధులిక, శ్రీలక్ష్మీ, సర్పంచ్ అంగోతు కాంతి కిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఉచిత నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్ఎం రమేష్‌బాబు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చార్టెడ్ ఎకౌంటెంట్ పోలోజు రాజ్‌కుమార్ తన జన్మదినం సందర్భంగా బుధవారం విద్యార్థులకు నోట్ బుక్స్, పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సంకా బద్రినారాయణ, రేణుకుంట్ల గణేష్, చార్టెడ్ ఎకౌంటెంట్ మాలే నవీన్, ఉపాధ్యాయుల సుజాత, సౌభాగ్య, దుర్గయ్య, నాగరాణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

మరిపెడ రూరల్: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని మండలంలోని వీరారం సర్పంచ్ అజ్మీర పద్మ అన్నారు. మండలంలోని వీరారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ అజ్మీర పద్మ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వండిన వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకన్న పాల్గొన్నారు.

రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ భూమిలో సేద్యం చేసుకుంటున్న ముడుపుగల్ అయోధ్య గ్రామ రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి తండా సందీప్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 30న మంత్రి కేటీఆర్ జిల్లాకు వస్తున్న సందర్భంగా ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలగాని శ్రీను, శ్రీను, శేఖర్, శంకర్, భావ్ సింగ్ పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి

బయ్యారం: జూలై 2న ఖమ్మం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగసభను విజయవంతం చేయాలని బుధవారం పొంగులేటి, కోరం అనుచరులు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరుతున్న సందర్భంగా నిర్వహించే బహిరంగసభకు ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సోమేష్, పొంగులేటి, కోరం అనుచరులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లో గల శ్రీవివేకవర్ధినీ హైస్కూల్‌కి చెందిన మాలోతు డేవిడ్‌రాజ్ అనే విద్యార్థి ఇటీవల వెలువడిన నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో సీటు సాధించాడు. ఈమేరకు బుధవారం పాఠశాలలో డేవిడ్‌రాజ్, అతడి తల్లిదండ్రులు హర్జి, శ్రీదేవిలను కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ ఘనంగా సన్మానించారు.

ఆర్థికసాయం

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లో ఎస్‌కే ఖలీల్ అనే వ్యక్తి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబానికి బుధవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసినిదుర్గేష్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి

గార్ల: మద్దివంచ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి పీడీఎస్‌యూ మండల ప్రధాన కార్యదర్శి మహేష్ మాట్లాడారు. పాఠశాలలో 36 మంది విద్యార్థులు ఉన్నా, కేవలం ఏకైక హెచ్ఎం మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నాడన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం



దంతాలపల్లి: తండ్రి చనిపోయాడు, ఉన్నతల్లి పక్షవాతంతో మంచానపడింది. మండల కేంద్రానికి చెందిన పస్తం కృష్ణవేణి హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతుంది. ఆమె కుటుంబ పరిస్థితి తెలుసుకున్న ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థినికి బుధవారం రూ.31వేల ఆర్థికసాయం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనువాస్, బ్రహ్మనందరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బహుజనులు ఏకం కావాలి

నర్సింహులపేట: బహుజనులకు రాజ్యాధికారం కోసం సబ్బండా జాతులు కలసి రావాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఐనాల పరశురాములు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. పేదరిక నిర్మూలన కోసం బహుజనులు ఏకం కావాలని పిలుపు నిచ్చారు. నాయకులు మహేష్, కృష్ణమూర్తి, లక్ష్మణ్, నాగరాజు పాల్గొన్నారు.

పొంగులేటిని కలిసిన నాయకులు

డోర్నకల్: ఖమ్మంలోని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ నాయకులు మాళోత్ నెహ్రూనాయక్ ఆధ్వర్యంలో పలు మండలాల నాయకులు పొంగులేటిని కలిశారు. జూలై 2న ఖమ్మం జరిగే తెలంగాణ జనగర్జన జరుగుతున్న నేపథ్యంలో పొంగులేటిని కలిసిన నెహ్రూనాయక్ ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కొండపల్లి రఘురామిరెడ్డి, మెరుగు సత్యనారాయణరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, భరత్ బాబు పాల్గొన్నారు. డోర్నకల్ కాంగ్రెస్ నాయకులు శీలం శ్రీనివాస్ తల్లి లలితమ్మ ఇటీవల మరణించడంతో నెహ్రూనాయక్ పరామర్శించారు.

కాట్రపల్లి మీదుగా భద్రాచలం బస్సు నడపాలి

కేసముద్రం: నర్సంపేట డిపో లేదా, హనుమకొండ డిపో నుంచి నడిచే భద్రాచలం బస్సును మండలంలోని కాట్రపల్లి గ్రామం మీదుగా నడపాలని బుధవారం నర్సంపేట ఆర్టీసీ డీఎంకు, గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుగులోతు సునిత, దస్రూనాయక్, నరేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయం

గార్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని ఇల్లెందు నియోజకవర్గ నాయకుడు రవినాయక్ అన్నారు. బుధవారం మండలంలోని నగరం, బాలాజీతండా పంచాయతీల్లో రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్ కరపత్రాలను ఇంటింటికీ పంచుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణగౌడ్ ప్రవీణ్, బాబూరావు, సీతారాములు, నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ వీరన్న, మంగీలాల్, నాగ పాల్గొన్నారు.

కార్మికుల సమ్యలు పరిష్కరించాలి

నెల్లికుదురు: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేసి రోజుకూలి రూ.600 ఇవ్వాలని అఖిల భారత ప్రతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈనెల 30న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న, అనిల్, సాయిలు, వెంకటయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

గొడ్డలి కామతో దాడి



గాయపడిన నెహ్రూ నాయక్

మరిపెడ రూరల్: భూతగదాలో నలుగురు కలిసి ఓ వ్యక్తి గొడ్డలి కామతో తీవ్రంగా గాయపర్చారు. సంఘటన మండలంలోని స్టేజితండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఇస్లావత్‌తండాలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు ఇస్లావత్ నెహ్రూ కథనం ప్రకారం .. మండలంలోని స్టేజితండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఇస్లావత్‌తండాకు చెందిన ఇస్లావత్ నెహ్రూనాయక్ అతని పాలివారు అయిన చిన్నాన్న కుమారుల మధ్య వారసత్వంగా వచ్చిన 1.10 గుంటల భూమి పంపకంలో కొద్దిరోజులుగా గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఇరువురు కుటుంబాలు గ్రామ పెద్ద మనుషులను ఆశ్రయించారు. వారి సమక్షంలో భూ పంచాతీయ తీర్మానం కావాల్సి ఉంది. ఈక్రమంలో కక్ష పెంచుకున్న చిన్నాన్న కుమారులు ఇస్లావత్ అశోక్, సాగర్, ప్రేమ్‌కుమార్, బాల నలుగురు కలిసి నెహ్రూనాయక్‌పై గొడ్డలి కామతో దాడి చేసి తలను తీవ్రంగా గాయపర్చారు. అడ్డుగా వచ్చిన నెహ్రూనాయక్ తల్లి బుల్లిని రాయితో కొట్టి గాయపర్చారు. ఈ విషయాన్ని బాధితుడు నెహ్రూనాయక్ మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దాడికి పాల్పడ్డ నలుగురిపై కేసు నమోదు అయినట్లు తెలిపాడు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

గార్ల: కూలీ పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా కోతి అడ్డం రావడంతో బైక్ పై నుంచి కింద పడి కోమాలోకి వెళ్లిన వివాహిత ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఎస్సై బానోత్ వెంకన్న కథనం ప్రకారం సంఘటనకు సంబంధించిన వివరాలు.. మండలంలోని కొత్తపోచారం గ్రామానికి చెందిన తిప్పారపు రూతమ్మ(32) భర్త హనుమంతరావుతో కలిసి ఈనెల 22న గార్లకు సుతారి కూలీ పనులకు వచ్చి ఇంటికి వెళ్తుండగా బైక్‌కు కోతి అడ్డురావడంతో బైక్ వెనుక కూర్చున్న రూతమ్మ కిందపడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు చిన్నపిల్లలు సంతానం. మృతురాలి అన్న ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు.

బావిలో పడి యువకుడు..

మరిపెడ రూరల్: పశువుల మేపడానికి వెళ్లిన యువకుడు వ్యవసాయ బావిలో నీట మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని తండధర్మారంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. లచ్చతండా గ్రామ పంచాయతీ పరిధిలోని అమిర్యాతండాకు చెందిన గుగులోతు వీరన్న నాగమణి దంపతుల కుమారుడు గుగులోతు శేఖర్ (20) పశువులను మేత కోసం తీసుకుని గ్రామ శివారులోకి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు గ్రామ శివారులో వెతుకుతుండగా వ్యవసాయ బావిలో శేఖర్ విగతజీవిగా పడి ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. ప్రమాదవశాత్తు బావిలో పడి ఈత రాకపోడంతో నీట మునిగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కాగా శేఖర్ ఇటీవల ఎస్సెస్సీ పూర్తి చేసి ఐటీఐ సీటు కోసం వేచి చూస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉపాధ్యాయుడు..

డోర్నకల్: స్థానిక మోడల్ స్కూల్‌లో తాత్కాలిక ఉపాధ్యాయుడిగా (హవర్లీ బేస్డ్) విధులు నిర్వహిస్తున్న కేవీఆర్ ప్రసాద్ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్ మంగళవారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

పదకొండు ఆవుల పట్టివేత ముగ్గురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో పదకొండు ఆవులను పట్టుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై రాంచరణ్ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాదులో కోత కోసమని అక్రమంగా తరలిస్తున్న పదకొండు గోవులను జమాండ్లపల్లి గ్రామంలో టాస్క్ ఫోర్సు ఇన్‌చార్జ్ డీఎస్పీ గండ్రాతి మోహన్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్సు ఎస్సై చీర రమేష్ బాబు, సిబ్బంది పట్టుకున్నారన్నారు. వాటిని తమకు అప్పగించగా కేసు నమోదు చేసి ఆ పదకొండు గోవులను తొర్రూరులో గల గోశాలకు పంపించామని తెలిపారు. బొలెరో వాహనంలో గోవులను తరలిస్తున్న ఎండీ.వాహెద్, ఇస్లావత్ బాలు, ఇస్లావత్ సతీష్ పై కేసు నమోదు చేశామన్నారు.

భూతగాదాలో ఐదుగురిపై..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామంలో జరిగిన భూతగాదాలో బాధితులు పుణ్యపుర్తి యాకమ్మ, ఆమె కుమారుడు మహేష్, కోడలు రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి ఐదుగురిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై రాంచరణ్ బుధవారం తెలిపారు. గొడవకు కారణమైన పుణ్యపుర్తి నిర్మల, బొర్రాజు లింగన్న, బొర్రాజు సురేష్, పుణ్యపుర్తి ఐలయ్య, పుణ్యపుర్తి యాకన్నపై కేసు నమోదు చేశామన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

గార్ల: ఇంటి దారి విషయంలో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో తల్లి కూతురుపై కర్రలతో తీవ్రంగా గాయపర్చిన ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న బుధవారం తెలిపారు. గార్ల మండలం పుల్లూరు గ్రామంకు చెందిన కిట్టం ఉమ తన ఇంటి దారి విషయంలో పక్కింటి వెంకటేశ్వర్లుతో ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కిట్టం ఉమతోపాటు ఆమె తల్లిపై కర్రలతో దాడి చేయడంతో వారి తలలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిపై దాడికి పాల్పడ్డ వెంకటేశ్వర్లుతో పాటు, మరో ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాల బాలిక అదృశ్యం

గార్ల: గార్లలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బాలిక బుధవారం పాఠశాల నుంచి అదృశ్యమైంది. మరిపెడ మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన బాలిక మధ్యాహ్నం పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోయినట్లు ఉపాధ్యాయులు హెచ్ఎంకు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే హెచ్ఎం ఉషారాణి స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై బానోత్ వెంకన్న పట్టణంలో గల సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బాలిక తల్లితండ్రులు సైతం మహబూబాబాద్‌లో వెతికి ఇంటికి వెళ్లగా రాత్రి సమయంలో బాలిక ఇంటికి వచ్చినట్లు తల్లితండ్రులు పాఠశాలకు సమాచారం ఇచ్చినట్లు హెచ్ఎం తెలిపారు. దీంతో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

చెట్టు నరికివేత అడ్డగింత

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని మార్వాడీ బజార్లో అనుమతి లేకుండా అతిపెద్ద వృక్షాన్ని నరికివేస్తుండడాన్ని నేనుసైతం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మహ్మద్ సలీమ బుధవారం అడ్డుకున్నారు. ఇంటి ముందు ఆకులు రాలుతున్నాయనే నెపంతో సుమారు 15సంవత్సరాల వయసుగల చెట్టును ఇంటి యజమాని కూలీలతో నరికిస్తున్నాడనే సమాచారం అందుకున్న సలీమ హుటాహుటిన అక్కడికి చేరకొని అడ్డుకున్నారు. వెంటనే బీట్ ఆఫీసర్ బోడ లక్ష్మణ్ కు సలీమ ఫోన్ ద్వారా విషయాన్ని వివరించి, సిబ్బందిని పంపించాలని కోరారు. దీంతో ఆయన ఆదేశాలతో బేస్ క్యాంప్ సిబ్బంది అక్కడికి చేరుకోవడంతో చెట్టును నరుకుతున్న ఇద్దరు కూలీలు పరారయ్యారు. దీంతో బేస్ క్యాంప్ సిబ్బంది ఇంటి యజమానిని హెచ్చరించి, అక్కడే ఉన్న చెట్టును నరికించే గుత్తెదారుడిని అదుపులోకి తీసుకొని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.

కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలి

నెహ్రూసెంటర్: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా కార్యక్రమ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సమగ్ర చట్టం చేసి కార్మికులకు రోజుకు రూ. 600 చెల్లించాలని, 50సంవత్సరాలు దాటిన కార్మికుడికి నెలకు రూ.10వేల జీవన భృతి ఇవ్వాలన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడం వల్ల కార్మికులకు పని లేకుండా పోతోందని, దీంతో కార్మికులు పట్టణాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి పని కల్పించాలన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఈ నెల 30న జరిగే కలెక్టరేట్ ముట్టడికి వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు దొడ్డరాజు, వీరన్న, వెంకట్రాంనర్సయ్య, వెంకన్న పాల్గొన్నారు.